సాక్షి వైఎస్‌ఆర్ జిల్లా

శుక్రవారం । 13 । అక్టోబర్ । 2023



జిల్లా రైఫిల్ షూటింగ్ జట్లు ఎంపిక

కడప నగరంలోని జాకీర్‌హుస్సేన్ రైఫిల్ షూటింగ్ అకాడమీలో బుధవారం జిల్లా స్థాయి రైఫిల్ షూటింగ్ ఎంపికలు గురువారం నిర్వహించారు. - 8లో



డాగ్ స్క్వాడ్ బలోపేతం

డాగ్‌స్క్వాడ్ బృందంలో నూతన జాగిలాలు రూబీ, డయానా గురువారం చేరాయి. ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ వాటిని పరిశీలించారు. - 8లో

గరిష్టం/కనిష్టం
37.0 /24.4

వాతావరణం

జిల్లాలో గురువారం 24.4 - 37.0 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 1.8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి. గాలిలో తేమ మధ్యాహ్నం 55 శాతం మధ్య నమోదైంది. - కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

విమానాశ్రయానికి మహర్దశ

కడప సిటీ : కడప విమానాశ్రయానికి మహర్దశ పట్టింది. రూ.224 కోట్లతో విమానాశ్రయంలో నూతన డొమెస్టిక్ టెర్మినల్ భవనం, ఇతర పనులు చేపట్టేందుకు ట్విట్టర్ వేదికగా టెండర్లు ఆహ్వానించారని ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా గురువారం ప్రకటించింది. కడప ఎయిర్‌పోర్ట్ డైరెక్టర్ సుజిత్ కుమార్ పొద్దర్ ఈ విషయాన్ని ధ్రువీకరించారు. 16,455 చదరపు అడుగుల విస్తీర్ణంలో 700 మందికి అత్యున్నత సౌకర్యాలు కల్పించేలా టెర్మినల్‌ను నిర్మించనున్నారు. మూడో ఏరో బ్రిడ్జి (టెర్మినల్ భవనం నుంచి నేరుగా ఏరో బ్రిడ్జి నుంచి విమానంలో చేరుకునేందుకు) నిర్మించనున్నారు. కారు పార్కింగ్, నూతన రహదారుల నిర్మాణం చేపట్టనున్నారు.

బాధ్యతల స్వీకరణ

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : కడప డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్‌గా జి.రాజేష్ స్థానిక పోస్టల్ కార్యాలయంలో కడప డివిజన్ ఇన్‌ఛార్జి కిరణ్ నుంచి గురువారం బాధ్యతలు స్వీకరించారు. గోవా, నరసరావుపేట, కర్నూలులో పనిచేసిన ఆయన కడపకు బదిలీపై వచ్చారు. ఆయన మాట్లాడుతూ సిబ్బంది సంక్షేమానికి కృషి చేస్తామని, జిల్లాలో తపాలా సేవలు విస్తరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో విజయ భాస్కర్, బాషా, అహ్మద్ హుస్సేన్, అమర్నాథ్, సుబ్బారాయుడు, మునాఫ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని నుంచి ప్రశంసాపత్రం



ప్రశంసాపత్రంతో నరసింహారెడ్డి

సంబేపల్లి : సంబేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న మడితాటి నరసింహారెడ్డికి గురువారం భారత ప్రధాన మంత్రి నరేంద్రమోడీ నుంచి ప్రశంసాపత్రం అందింది. ఒత్తిడి లేని వాతావరణంపై కల్పించేందుకు నిర్వహించిన పరీక్షా పే చర్చ కార్యక్రమంలో నరసింహారెడ్డి ఉత్తమ సూచనలు ఇవ్వడంతో ధన్యవాదాలు తెలియజేస్తున్నట్లు ప్రశంసాపత్రంలో ప్రధాన మంత్రి పేర్కొన్నారు. నరసింహారెడ్డి మాట్లాడుతూ ప్రశంసా పత్రాన్ని తన జీవితంలో అత్యంత విలువైనదిగా భావిస్తానన్నారు.

పులివెందులలో యాత్ర-2 షూటింగ్



పోలీస్ స్టేషన్ సన్నివేశాలను చిత్రీకరిస్తున్న చిత్ర యూనిట్ సభ్యులు

పులివెందుల టౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పడిన కష్టాల గురించి, ఏ విధంగా పాదయాత్రతో ముఖ్యమంత్రి పీఠం దక్కించుకున్నారన్న అంశంపై వైఎస్సార్ జిల్లా పులివెందులలో గురువారం 'యాత్ర-2' సినిమా షూటింగ్ నిర్వహించారు. డైరెక్టర్ మహి వి రాఘవ్ మాట్లాడుతూ యాత్ర-1 లో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి గురించి తెలియజేశామని, ఇపుడు యాత్ర-2లో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మరణానంతరం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురించి అద్భుతమైన సన్నివేశాలుంటాయన్నారు. నెల రోజుల పాటు పులివెందుల చుట్టు ప్రక్కల ప్రాంతాల్లో షూటింగ్ ఉంటుందన్నారు. ఇందులో వైఎస్ జగన్ పాత్రలో హీరో జీవా నటిస్తున్నట్లు తెలిపారు. ప్రొడ్యూసర్ శివ మేక, కెమెరామెన్ మదిరాజు, సంతోష్ నారాయణన్, సెల్వా, ఎడిటర్ శ్రవణ్ పాల్గొన్నారు.

జిల్లా స్థాయిలో ప్రతిభ



విద్యార్థి రఫీని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

చాపాడు : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన అండర్-17 వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో మండలంలోని అయ్యవారిపల్లె జెడ్పీ హైస్కూల్ విద్యార్థి కె.రఫీ ప్రతిభ చాటాడు. జిల్లా స్థాయి పోటీలలో ప్రతిభ చూపి ప్రథమ స్థానంలో నిలవడంతో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు ప్రధానోపాధ్యాయుడు ఎస్.గుర్రప్ప తెలిపారు. విద్యార్థి, ఫిజికల్ డైరెక్టర్ శివారెడ్డిని, ఉపాధ్యాయులు అభినందించారు.

14న బ్యాడ్మింటన్‌కు ఎంపిక

కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని వైఎస్‌ఆర్ ఇండోర్ స్టేడియంలో ఈనెల 14వ తేదీన జిల్లా స్థాయి అండర్-19 బ్యాడ్మింటన్, జూడో, చెస్ పోటీలకు క్రీడాకారులను ఎంపిక చేస్తున్నట్లు ఎస్‌జీఎఫ్ అండర్-19 కార్యదర్శి సి.శారద తెలిపారు. వల్లూరు ఏపీ మోడల్ స్కూల్‌లో అదేరోజున సైక్లింగ్ ఎంపికలు, ప్రొద్దుటూరు జార్జి క్లబ్‌లో రైఫిల్ షూటింగ్ ఎంపికలు నిర్వహిస్తామన్నారు. క్రీడాకారులు ధ్రువీకరణపత్రాలతో ఎంపికలకు హాజరుకావాలని సూచించారు.

జగనన్న అనుగృహం

- కలెక్టర్ విజయరామరాజు
- చింతలమడుగు ఇళ్లలో గృహప్రవేశాలు
- లబ్ధిదారులకు 375 ఇళ్లు కేటాయింపు
- అన్ని వసతులతో ఆహ్లాద వాతావరణం



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ విజయరామరాజు

వేంపల్లె : ఆహ్లాదకరమైన కొండ.. పక్కన పంట పొలాలు, సుందరమైన పర్యాటక శోభను తలపిస్తోందని, ఊరు బాగుంటేనే సమాజం బాగుంటుందనే సానుకూల దృక్పథంతో ప్రజా ప్రతినిధులు, అధికారులు ముందడుగు వేయాలని కలెక్టర్ విజయరామరాజు అన్నారు. 'నవరత్నాలు – పేదలందరికీ ఇళ్లు' పథకంలో భాగంగా వేంపల్లె మండలం చింతలమడుగుపల్లె 18.37ఎకరాల్లో ఏర్పాటైన జగనన్న కాలనీలో శోభాయామానంగా ముస్తాబైన నూతన ఇళ్లలో లబ్ధిదారులచే గృహ ప్రవేశం చేయించారు. వారికి అభినందనలు తెలుపుతూ సొంతింటి కల సాకార సంబరాల్లో ఆయన పాలుపంచుకున్నారు. అంతకు ముందు 7.43 లక్షల నూతన గృహాలలో సామూహిక గృహ ప్రవేశం చేసే కార్యక్రమాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కాకినాడ జిల్లా సామర్లకోటలో లాంఛనంగా జగనన్న కాలనీ ప్రారంభించగా, ఇక్కడ చింతలమడుగు పల్లెలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు కలిసి ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలోనే ఇది మహత్తరమైన ఘట్టమన్నారు. ఇంటి స్థలాల పంపిణీనే కాకుండా.. లబ్ధిదారులకు అన్ని వసతులతో కూడిన ఇళ్లను నిర్మించి ఇచ్చిన ఘనత రాష్ట్ర ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. కులం, మతం, ప్రాంతం, పార్టీలు చూడకుండా అర్హతే ప్రాతిపదికగా జవాబుదారీతనంతో లబ్ధిదారుల ఎంపిక జరిగిందన్నారు. జగనన్న కాలనీలలో రహదారులు, కాల్వలు, విద్యుత్తు, నీటి వసతి కల్పించామని, సామాజిక అవసరాలకు స్థలాన్ని వదిలేసి పచ్చటి మొక్కలతో తీర్చిదిద్దుతామన్నారు. చింతలమడుగు పల్లెలో 500 ప్లాట్లకుగానూ 373 గృహాల నిర్మాణం పూర్తయిందన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యుడు మాచిరెడ్డి రవి కుమార్‌రెడ్డి, కన్వీనర్ చంద్ర ఓబుల్‌రెడ్డి, గంగుల శైలజ, లక్ష్మి ఉష, విజయలత, గాయత్రి, పఠాన్ రహంతుల్లాఖాన్, రాఘవేంద ప్రసాద్, గోగుల కొండయ్య, వెంకటేశ్వర్లు, కృష్ణయ్య, అధికారులు పాల్గొన్నారు.



పేదల పాలిట పెన్నిధిగా మారారు



జగనన్న తన పాదయాత్రలో ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తూ పేదల పాలిట పెన్నిధిగా మారారు. ఈ రోజు మా కుటుంబంలో ఆనందం వెల్లివిరుస్తుందంటే సీఎం జగనన్న చలువే. మరే రాష్ట్రంలో లేని విధంగా పేదల కోసం ఇంటి స్థలం మంజూరు చేసి ఇళ్లు కట్టించి అన్ని వసతులు కల్పించారు. జగనన్నకు ధన్యవాదాలు.

- వి.లక్ష్మిరెడ్డి, చింతలమడుగుపల్లె, వేంపల్లె

జగనన్న రుణం తీర్చుకోలేం



మహిళల పేరుతో ఇన్ని లక్షల విలువ చేసే నివాస స్థలంతోపాటు ఇళ్లు కట్టించి ఇవ్వడం అభినందనీయం. కరోనా కష్టకాలంలో మాకు ఎంతో సాయం చేశారు. మాకంటూ ఒక స్థిరాస్థిని ఇచ్చిన మా ముఖ్యమంత్రి పదికాలాల పాటు చల్లగా ఉండాలి. అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పిస్తూ, ఆహ్లాదకరమైన కాలనీ నిర్మించిన ప్రభుత్వానికి ధన్యవాదాలు.

- ఓ.సుధారాణి, చింతలమడుగుపల్లె, వేంపల్లె

ఇది మా అదృష్టంగా భావిస్తున్నాం



అన్ని రంగాల్లో మహిళలకు ప్రాధాన్యం ఇచ్చి, మహిళల పేరుతోనే ఇళ్ల పట్టాలు ఇవ్వడం గొప్ప విషయం. ఇంటి నిర్మాణ పనులను పూర్తి చేసి ఈ రోజు గృహ ప్రవేశాలు చేయడం అదృష్టంగా భావిస్తున్నాం. మా పేరుతో సొంతిల్లు ఇచ్చి, మమ్మల్ని ఇంటి పెద్దగా చేయడం ఎంతో సంతోషంగా ఉంది. జగనన్న లాంటి ముఖ్యమంత్రి రాష్ట్రాన్ని పాలించడం మహిళల అదృష్టంగా భావిస్తున్నాం.

- ఎం.ప్రసాద్‌రెడ్డి, చింతలమడుగుపల్లె, వేంపల్లె

ఇది మామూలు విషయం కాదు



గతంలో ఎన్నడూలేని విధంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందుకుంటున్నాం. మహిళలకు జగన్ సర్కారు ఇస్తున్న ప్రాధాన్యమేంటో అర్థమవుతోంది. లక్షలాది పేద మహిళల పేరు మీద ఇళ్ల పట్టాలిచ్చి, ఇళ్లు నిర్మించి ఇవ్వడం మామూలు విషయం కాదు. ఇచ్చిన మాట నిలబెట్టుకున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మహిళలంతా జీవితాంతం రుణపడి ఉంటాం.

- పేట్ల మంగమ్మ, చింతలమడుగుపల్లె, వేంపల్లె

దేశ చరిత్రలో సువర్ణ అధ్యాయం



సీఎం జగన్ నిర్ణయం దేశ చరిత్రలో ఒక సువర్ణ అధ్యాయం. 30 లక్షల మంది పైగా పేద మహిళల పేరు మీద ఇళ్ల పట్టాలిచ్చి, రూ.1.80 లక్షల ఆర్థిక సాయం, మహిళా సంఘం నుంచి రుణం కూడా ఇప్పించడం మామూలు విషయం కాదు. తోడబుట్టిన వారు కూడా చేయలేని సాయం మహిళలకు జగన్ ప్రభుత్వం చేస్తోంది. ఈ గృహప్రవేశం మాకు ఇంత సంతోషాన్ని నింపింది.

- మేలంగి ధరణి, చింతలమడుగుపల్లె, వేంపల్లె

ఉపాధి పనుల గుర్తింపు

కడప సెవెన్‌రోడ్స్: 2024-25 సంవత్సరంలో చేయదగిన ఉపాధి హామీ పనులను గుర్తించాలని కలెక్టర్ విజయరామరాజు అధికారులను ఆదేశించారు. స్థానిక జెడ్పీ సమావేశ మందిరంలో అధికారులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఉపాధి హామీ సిబ్బంది గ్రామాలు, మండలాల్లో పర్యటించి ప్రజలతో చర్చించాలన్నారు. షెల్ఫ్ ఆఫ్ వర్క్స్‌ను తయారు చేయాలని, ముఖ్యంగా డ్రైనేజీ, ప్రకృతి వనరుల అభివృద్ధికి అవసరమైన పనులు ఉండాలన్నారు. రాబోయే ఏడాది కూలీలందరికీ పెద్ద ఎత్తున పనులు కల్పించేందుకు ప్రణాళిక సిద్ధం చేయాలని ఆదేశించారు. డ్వామా పీడీ యదుభూషణరెడ్డి మాట్లాడుతూ సిబ్బంది నిబద్ధతతో, పారదర్శకంగా పనిచేయాలన్నారు. గ్రామ స్థాయిలో అన్ని శాఖల సిబ్బందిని, ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు, రైతులు, ఉపాధి కూలీలను సమన్వయపరిచి పనులు గుర్తించాలన్నారు.

ఫిర్యాదులను పరిష్కరించాలి

ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందించడంతో పాటు.. ప్రజల ఫిర్యాదులను పరిష్కరించాలని కలెక్టర్ వి.విజయరామరాజు సూచించారు. ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి డాక్టర్ జవహర్‌రెడ్డి గురువారం కలెక్టర్లతో వర్చువల్ విధానంలో సమీక్షించారు. వీసీ ముగిసిన అనంతరం జిల్లా అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్య కార్యదర్శి సూచనల మేరకు సంక్షేమ ఫలాలు.. ప్రజలకు సంతృప్తి స్థాయిలో అందాలన్నారు. ఈ సమావేశంలో డ్వామా పీడీ యదుభూషణ్ రెడ్డి, డీపీఓ ప్రభాకర్ రెడ్డి, డీఆర్డీఏ, ప్రాజెక్టు డైరెక్టర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

అరక్కోణం ప్యాసింజరు రైలు రద్దు

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప-అరక్కోణం-కడప మధ్య నడుస్తున్న ప్యాసింజర్ రైలును ఈనెల 16నుంచి 22 వరకు రద్దు చేసినట్లు కడప సీనియర్ రైల్వే కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ ఎ.జనార్దన్ తెలిపారు. సాంకేతిక కారణాల వల్ల ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. ఈ విషయాన్ని ప్రయాణికులు గమనించాలన్నారు.

కీచక టీచర్ గంగరాజు అరెస్టు!



గంగరాజు (ఫైల్)

సాక్షి ప్రతినిధి, కడప : పాఠాలు చెప్పి బుద్ధి నేర్పించాల్సిన మాష్టారు కీచకుడిగా మారాడు. ఓ మహిళపై వేధింపులకు పాల్పడ్డాడు. డీఈఓకు ఫిర్యాదు చేయడంతో శాఖాపరమైన చర్యలు తీసుకున్నా..మార్పు రాలేదు. దీంతో ఆ ఉపాధ్యాయిని ఎస్పీ సిద్ధార్థ కౌశల్‌కు ఫిర్యాదు చేసింది. ఆగ్రహంతో ఊగిపోయిన అతడు నాపైనే ఫిర్యాదు చేస్తావా...అంటూ బెదిరింపులకు దిగడమే గాక, ఇంటికి వెళ్లే మార్గంలో అటకాయించి కారుతో ఢీకొట్టి ఇపుడు కటకటాల పాలయ్యారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. వీరపునాయునిపల్లె మండలంలో ఎస్.పాలగిరి జడ్పీ హైస్కూల్‌లో సోషియల్ స్కూల్ అసిస్టెంట్‌గా ఎన్వి.గంగరాజు పనిచేస్తున్నారు. అదే పాఠశాలలో హిందీ స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఎస్.వాసవి వెంట పడుతూ గంగరాజు వేధింపులకు గురి చేయడం ప్రారంభించాడు. స్కూటీపై వెళ్లే మార్గంలో అడ్డు తగిలి అటకాయించడంతో ఆమె గతంలో డీఈఓ రాఘవరెడ్డికి ఫిర్యాదు చేశారు. డీఈవో సస్పెండ్ చేయడమేగాక, గంగరాజును తొండూరు మండలం అగుడూరు జడ్పీ హైస్కూల్‌కు బదిలీ చేశారు. మరింత ఆగ్రహంతో గంగరాజు పాలగిరి మార్గం మీదుగా అగుడూరుకు వెళ్తూ పాఠశాలకు వచ్చే పోయే సమయాల్లో తిష్టవేసి మహిళా టీచర్‌పై అనుచితంగా ప్రవర్తించడంతో మరోమారు ఆమె డీఈఓకు ఫిర్యాదు చేశారు. దీంతో గంగరాజు మళ్లీ సస్పెండ్‌కు గురయ్యారు. ఉపాధ్యాయిని ఎస్.వాసవిని సైతం ఓబులవారిపల్లె మండలం పెద్దఓరంపాడు హైస్కూల్‌కు బదిలీ చేశారు. అయినప్పటికీ గంగరాజులో మార్పు రాకపోగా ఉపాధ్యాయినిపై కోపంతో పెద్దఓరంపాడు హైస్కూల్ నుంచి వెళ్లే మార్గంలో అటకాయించి వేధింపులకు పాల్పడ్డాడు. దీంతో వాసవి ఎస్పీ సిద్ధార్థకౌశల్‌కు స్పందనలో ఫిర్యాదు చేశారు. విచారణ చేయాలని దిశా పోలీసులకు ఎస్పీ సూచించడంతో కౌన్సిలింగ్‌కు హాజరు కావాలని గంగరాజుకు పోలీసులు ఫోన్ చేశారు. అతడు పోలీసుల దరికి చేరకపోగా, కారులో వచ్చి స్కూటీపై వెళ్తున్న వాసవీ దంపతులను ఢీ కొట్టారు. వాసవీ భర్తకు గాయాలయ్యాయి. వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, ఎస్ఐ జి.మధుసూధనరెడ్డి గంగరాజును అరెస్టు చేసి కేసు నమోదు చేశారు. కోర్టుకు హాజరు పరచి గంగరాజును రిమాండ్‌కు ఆదేశించడంపై మహిళలోకం హర్షం వ్యక్తం చేస్తోంది. కీచక ఉపాధ్యాయుడిపై చట్టాన్ని వర్తింపజేసిన పోలీసుల చర్యలకు ప్రశంసలు లభిస్తున్నాయి.

ప్రభుత్వ ధ్యేయం.. అందరి ఆరోగ్యం

కడప రూరల్ : అందరి ఆరోగ్యమే ప్రభుత్వ ధ్యేయంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది. జిల్లా వ్యాప్తంగా 26 కేంద్రాల్లో గురువారం వైద్య శిబిరాలు నిర్వహించారు. కడప నగరంలోని ఆలంఖాన్‌పల్లెలో నిర్వహించిన శిబిరంలో డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, సోషల్ వెల్ఫేర్ బోర్డు రాష్ట్ర చైర్మన్ పులి సునీల్‌కుమార్, డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, టీటీడీ బోర్డు సభ్యుడు యానాదయ్య పాల్గొన్నారు. జమ్మలమడుగు నియోజకవర్గం మాలేపాడులో ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్ రెడ్డి, కమలాపురం నియోజకవర్గం ఎన్ పాలగిరి, ఎర్రగుడిపాడులో ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి, మైదుకూరు మండలం జీవీ సత్రంలో ఎమ్మెల్యే రఘురామిరెడ్డి, ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

ఆర్టీసీలో దసరా సందడి!

- పండగ నేపథ్యంలో ప్రత్యేక సర్వీసులు
- గతేడాదిలాగా సాధారణ ఛార్జీలతో ప్రయాణం
- హైదరాబాద్, విజయవాడ, చెన్నై, బెంగుళూరుకు సర్వీసులు
- కడప రీజియన్ నుంచి 130 స్పెషల్ సర్వీసులు



ఆర్టీసీ బస్టాండు ముఖ ద్వారం

కడప కోటిరెడ్డిసర్కిల్ : దసరా పండగ దగ్గర పడుతోంది. పల్లెలు, పట్టణాలు అన్న తేడా లేకుండా ఉమ్మడి వైఎస్సార్ జిల్లా అంతటా శరన్నవరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. మరో మూడు రోజుల్లో దసరా ఉత్సవాలు మొదలుకానున్నాయి. ఈ పండగ వేళ ప్రయాణికుల రద్దీని సొమ్ము చేసుకొనేందుకు ప్రైవేటు ట్రావెల్స్ సిద్ధమవుతున్నాయి. ప్రయాణికుల ముక్కుపిండి మరీ అధిక ఛార్జీలు వసూలు చేసేందుకు సిద్ధమవుతున్నారు.

ప్రయాణికుల సేవలో...

ఒకవైపు దసరా పండగకు ప్రైవేటు ట్రావెల్స్ అధిక ఛార్జీలు వసూలు చేస్తుంటే, మేరో వైపు ఆర్టీసీ లాభ నష్టాలతో ప్రమేయం లేకుండా వారి సేవే పరమావధిగా అడుగులు వేస్తోంది. దసరా, దీపావళి, సంక్రాంతితో సహా ఇతర ఉత్సవాల సమయంలో ప్రయాణికుల సౌకర్యార్థం డిమాండ్‌ను బట్టి లాభాపేక్ష లేకుండా ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు నడుపుతోంది. వరుస సెలవులు వచ్చే పండుగల్లో దసరాకు తొలి ప్రాధాన్యం ఉంటుంది. ఈ పండగ వేళ దూర ప్రాంతాలకు ప్రయాణించే వారిపై గతంలో మాదిరిగానే అదనపు ఛార్జీల భారం మోపకుండా సాధారణ ఛార్జీలతో ఆర్టీసీ బస్సులు నడుపనున్నారు. రానూ పోనూ ప్రయాణానికి ఒకేసారి టిక్కెట్ బుక్ చేసుకుంటే ఛార్జీలో పది శాతం రాయితీ ఇస్తోంది. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు దసరా స్పెషల్ బస్సులు నడిపేందుకు ఆర్టీసీ అధికారులు చురుగ్గా ఏర్పాట్లుచేస్తున్నారు. జిల్లాలోని పలు డిపోల నుంచి ప్రయాణికుల సౌకర్యార్థం 130 ప్రత్యేక బస్సులు నడిపేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. విజయవాడ, బెంగుళూరు, చెన్నై, హైదరాబాదు, విశాఖ పట్టణాలకు బస్సులు నడపనున్నారు.


ప్రైవేటు బాదుడు

ప్రైవేటు ట్రావెల్స్ అధిక ఛార్జీలు తట్టుకోలేక ప్రయాణికులు అత్యధికంగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణానికి మొగ్గు చూపుతున్నారు. పండగ కోసం దూర ప్రాంతాలకు వచ్చేవారు ఇప్పటికే ఆర్టీసీలో టిక్కెట్ బుక్ చేసుకుంటున్నారు. దసరాకు వారం రోజుల ముందునుంచే బస్సులు కిక్కిరిసిపోతున్నాయి. ప్రయాణం సురక్షితం, సుఖవంతమనే నమ్మకంతో ఎక్కువ మంది ఆర్టీసీ బస్సులకే ప్రాధాన్యం ఇస్తుంటారు. గత చంద్రబాబు పాలనలో పండగ వేళ ప్రత్యేక బస్సుల పేరుతో ప్రయాణికులపై 30-50 శాతం అదనపు భారం మోపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసిన తర్వాత నుంచి ఇందుకు పూర్తి భిన్నమైన పరిస్థితి కనిపిస్తోంది. ప్రయాణికులపై పైసా అదనపు భారం వేయకుండా ప్రభుత్వం ప్రత్యేక బస్సులను సైతం సాధారణ ఛార్జీలతో నడుపుతుండడం విశేషం.

పది రోజుల సెలవులు రావడంతో..

వైఎస్సార్ జిల్లాకు చెందిన వారు విద్య, ఉద్యోగ, వ్యాపారాల నిమిత్తం హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, విజయవాడ ప్రాంతాల్లో ఉంటున్నారు. ఎక్కువ మంది సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లుగా ఈ ప్రాంతాల్లో స్థిరపడ్డారు. దసరా పండగకు పది రోజులు సెలవులు రావడంతో దూర ప్రాంతాల్లో ఉంటున్న వారు కుటుంబ సమేతంగా బయలు దేరుతున్నారు. రైళ్లలో దాదాపు రెండు నెలల ముందే బెర్త్‌లు రిజర్వు చేసుకోవడం జరిగింది. ఆర్టీసీ బస్సుల్లో స్వస్థలాలకు వచ్చేందుకు ముందస్తు రిజర్వేషన్లు చేయించు కుంటున్నారు.

దసరాకు ప్రత్యేక సర్వీసులు



ప్రయాణీకుల రద్దీని దృష్టిలో పెట్టుకుని ప్రత్యేక బస్సులు నడుపుతున్నాం. హైదరాబాద్, బెంగుళూరు, విజయవాడ, చెన్నై నగరాలతోపాటు రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు 175 బస్సులు ఏర్పాటుచేశాం. ఈ నెల 13వ తేదీ నుంచి 26వ తేదీ వరకు హైదరాబాద్‌కు 75, బెంగుళూరుకు 60, విజయవాడకు 30, చెన్నైకు 10 సర్వీసులు నడుస్తాయి. రానూ, పోనూ టిక్కెట్ తీసుకుంటే 20 శాతం రాయితీ లభిస్తుంది.

- పాలిమేర గోపాల్‌రెడ్డి, జిల్లా ప్రజారవాణాధికారి, కడప

అన్నదాతకు అండగా.. దిగుబడికి మద్దతుగా

పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించి అన్నదాతలకు ప్రభుత్వం అండగా నిలుస్తోంది. పంటసాగుకు అవసరమైన పెట్టుబడి సాయం ఇప్పటికే అందించిన ప్రభుత్వం విత్తనాలు, ఎరువులు, పురుగు మందులను రాయితీపై రైతు భరోసా కేంద్రాల ద్వారా అందించింది. ఇపుడు ఆరుగాలం కష్టపడి పండించిన దిగుబడులకు మద్దతు ధర ప్రకటించి రైతన్నకు తీపి కబురు అందించింది.

- పంటలకు గిట్టుబాటు ధర ప్రకటించిన ప్రభుత్వం
- క్వింటా వరి ధర రూ. 2183 పత్తి ధర రూ. 7020



ఏపుగా పెరిగిన వరిపంట



సాగులో ఉన్న మినుము పంట

కడప అగ్రికల్చర్ : జిల్లా వ్యాప్తంగా ఈ ఖరీఫ్ సీజన్‌లో 73603 హెక్టార్లలో వివిధ పంటలు సాగు చేశారు. అత్యధికంగా వరి 22711 హెక్టార్లలో, వేరుశనగ 4273, పత్తి 22429, మిరప 2929, పసుపు 888, పొద్దుతిరుగుడు 257, ఆముదం 680, సోయాబీన్ 554, కంది 5091, మినుము 4096, పెసలు 142, ఉలవలు 10, ఆవుగడ్డి 48, జొన్న 978, సజ్జ 385, మొక్కజొన్న 1151, కొర్ర 298 హెక్టార్లలోనూ సాగు చేశారు. ఈ ఏడాది కేసీ కాల్వకు నీరు రాకపోయినా గతేడాది కంటే 3006 హెక్టార్లు అధికంగా దాదాపు 22711 హెక్టార్లలో వరి పంట సాగు చేశారు. రబీ సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా 1,52,600 హెక్టార్లలో వివిధ పంటలు సాగు చేయనున్నారు. రైతన్నలకు కావాల్సిన విత్తనాలను ప్రభుత్వం ఇప్పటికే ఆర్బీకేల ద్వారా అందించింది. ఎరువులను సిద్ధంగా ఉంచింది. పండించిన దిగుబడులకు ముందుగానే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మద్దతు ధర ప్రకటించి వారిలో ఆశలు రేకెత్తిస్తున్నాయి.

ముందుగానే గిట్టుబాటు ధర కల్పించాం



ప్రభుత్వం పంటలకు మద్దతు ధర ప్రకటించింది. ముందుగా ప్రకటించడంతో వ్యాపారులు అధిక ధరకు పంట దిగుబడులు కొనుగోలు చేయడానికి ముందుకు వస్తారు. దీనివల్ల రైతులకు గిట్టుబాటు ధర లభిస్తుంది.

- అయితా నాగేశ్వరరావు, జిల్లా వ్యవసాయ అధికారి

ప్రభుత్వం పంటలకు ప్రకటించిన మద్దతు ధర

పంట పేరు	మద్దతు ధర క్వింటా (రూ.లలో)
పసుపు	6850
మిరప	7000
ఉల్లి	770
చిరుధాన్యాలు	2500
వరి ధాన్యం(కామన్)	1183
ధాన్య(గ్రేడ్-ఎ)	2203
జొన్నలు	3225
జొన్నలు(హైబ్రిడ్)	3180
సజ్జలు	2500
రాగులు	3846
మొక్కజొన్నలు	2090
కందులు	7000
పెసలు	8558
మినుములు	6950
వేరుశనగలు	6377
పత్తి (పొట్టిగింజ)	6620
పత్తి (పొడువుగింజ)	7020
బత్తాయి	1400
అరటి	800
సోయాబీన్	4600
పొద్దుతిరుగుడు	6760

27న జానపద పోటీలు

కడప ఎడ్యుకేషన్ : పాఠశాల విద్య, ఎస్సీఈఆర్టీ ఆధ్వర్యంలో ఈ నెల 27న రాయచోటి డైట్ కళాశాలలో జానపద నృత్య, రోల్ ప్లే(పాత్ర పోషణ) పోటీలు నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ జిల్లా డీఈఓ, రాయచోటి డైట్ కళాశాల ప్రిన్సిపల్ ఎద్దుల రాఘవరెడ్డి తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని 8, 9వ తరగతి విద్యార్థులు జానపదం, 9వ తరగతి విద్యార్థులు రోల్ ప్లే పోటీలకు అర్హులని తెలిపారు. రోల్‌ప్లేలో ఆరోగ్యంగా ఎదగడం, పోషకాహారం, శ్రేయస్సు, వ్యక్తిగత భద్రత ఇంటర్నెట్, గాడ్జెట్లు, మీడియా అక్షరాస్యత అంశాలపై పోటీ ఉంటుందన్నారు. బాలుర, బాలికల సమానావకాశాలు, పిల్లల అభివృద్ధిలో ఉమ్మడి కుటుంబం పాత్ర, పర్యావరణ పరిరక్షణ, పదార్థాల దుర్వినియోగం, కౌమారదశ అంశాలపై జానపద పోటీలు ఉంటాయన్నారు. ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లు తమ విద్యార్థుల పేర్లను పంపాలన్నారు. వివరాలకు డైట్ అధ్యాపకులు అజయ్‌కుమార్ 9347541312, శ్రీదేవి 9441228359, అసదుల్లా 9440084715లో సంప్రదించాలన్నారు.

క్లుప్తంగా

చీటింగ్ కేసు నమోదు

కొండాపురం : చామలూరు గ్రామానికి చెందిన తలారి రవితేజ తన సొంత అక్క డబ్బును స్వాహా చేయడంతో అతనిపై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు తాళ్లప్రొద్దుటూరు ఆర్.మోహన్ గురువారం తెలిపారు. ఆయన కథనం మేరకు వివరాలు ఇలా.. చామలూరు గ్రామంలో నివాసం ఉండే తలారి రామయ్య కుమారుడు రవితేజ, కుమార్తె లక్ష్మీదేవికి గండికోట ముంపు పరిహారం కింద ఆర్అండ్ఆర్ ప్యాకేజి డబ్బులు ఒక్కొక్కరికి రూ.10 లక్షలు వచ్చాయి. అయితే లక్ష్మీదేవి తనకు వచ్చిన రూ. 10 లక్షలు బ్యాంకు ఖాతాలో జమ చేసుకుంది. ఈ ఖాతాకు ఆమె సోదరుడు రవితేజ ఆమెకు తెలియకుండా తన ఫోన్ నంబర్ లింక్ చేసుకున్నాడు. దీంతో ఏటీఎం కార్డు ద్వారా, ఫోన్ పే ద్వారా నగదు మొత్తం డ్రా చేసుకున్నాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మద్యం స్వాధీనం

దువ్వూరు : మండల పరిధిలోని మూడిండ్లపల్లె గ్రామ పొలాల్లో అక్రమంగా మద్యం బాటిళ్లను అమ్ముతున్న మేకల నరసింహులు అనే వ్యక్తిని గురువారం అరెస్టు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. అతని వద్ద నుంచి 7 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని ఎస్ఐ పేర్కొన్నారు.

మహిళపై దాడి

చింతకొమ్మదిన్నె : మండలంలోని ఇందిరా నగర్‌కు చెందిన ఎస్తేరమ్మపై గట్టు సతీష్ అనేవ్యక్తి దాడి చేసి గాయపరిచి అసభ్యకరంగా మాట్లాడినట్లు సీకె దిన్నె ఎస్ఐ భూమా అరున్‌రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు అనంతపురం జిల్లా ఎల్లనూరు మండలం వెన్నపూసపల్లికి చెందిన తబితకు కడపకు చెందిన గట్టు సతీష్‌తో గత 11 సంవత్సరాల క్రితం వివాహమైంది. వీరు ఇందిరానగర్‌లో కాపురం ఉంటున్నారు. తబిత రిమ్స్ ఆసుపత్రిలో కాంట్రాక్ట్ నర్స్‌గా పని చేస్తోంది. అయితే ఆమెను భర్త తరచూ వేధించేవాడు. ఈ నేపథ్యంలో ఈ నెల 9వ తేదిన విధులకు వెళ్లిన తబిత తిరిగి ఇంటికి రాకపోవడంతో సతీష్ తమ్ముడు సుదర్శన్ తబిత అక్క అయిన ఎస్తేరమ్మకు సమాచారం అందించాడు. దీంతో ఆమె సతీష్ ఇంటికి వచ్చి అడుగగా ఎస్తేరమ్మపై దాడి చేసి అసభ్యకరంగా ప్రవర్తించాడు. గాయపడిన ఆమె చికిత్స నిమిత్తం రిమ్స్‌లో చేరడంతో ఔట్ పోస్టు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ మేరకు సీకేదిన్నె పోలీస్ స్టేషన్‌కు కేసు బదిలీ చేసినట్లు ఎస్ఐ తెలిపారు. కాగా విధులకు వెళ్లిన తబిత మరుసటి రోజు ఇంటికి వచ్చినట్లు ఆయన తెలిపారు.

డాగ్ స్క్వాడ్ బలోపేతం

జాగిలాలను పరిశీలించిన జిల్లా ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్


జాగిలాలను ఆప్యాయంగా పలకరిస్తున్న జిల్లా ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్

కడప అర్బన్ : కేసులను ఛేదించడంలో, నేరస్తులను గుర్తించడంలో కీలకపాత్ర పోషించే జిల్లా పోలీస్‌శాఖ డాగ్‌స్క్వాడ్ బృందంలో మరో రెండు జాగిలాలు చేరి మరింత బలోపేతం అయింది. ఈ నేపథ్యంలో గురువారం మంగళగిరి పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో 8 నెలల శిక్షణ పొందిన రెండు నూతన జాగిలాలు రూబీ, డయానా జిల్లా పోలీస్ కార్యాలయానికి చేరుకున్నాయి. జిల్లా ఎస్పీ సిద్ధార్థ్ కౌశల్ జాగిలాలను పరిశీలించి డాగ్‌స్క్వాడ్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. కేసుల ఛేదనలో కీలకమైన జాగిలాల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ఈ జాగిలాలతో మొత్తం డాగ్ స్క్వాడ్ సంఖ్య 8కి చేరుకుంది. ప్రస్తుతం కేటాయించిన వాటిలో ఒకటి క్రాకర్స్ స్పానియల్ జాతికి చెందినది. రెండోది బెల్జియం మలనాయిస్ జాతికి చెందినది. కాకర్స్ స్పానియల్ పేలుడు పదార్థాలను పసిగట్టడంలో దిట్ట. బెల్జియం మలనాయిస్ హత్య, దొంగతనాల నేరాలకు పాల్పడ్డ నేరస్తులను గుర్తించడంలో నేర్పరి. ఈ కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ ఎస్.ఎస్.ఎస్.వి. కృష్ణారావు, ఏఆర్ డీఎస్పీ బి. రమణయ్య, ఆర్ఐలు వీరేష్, సోమశేఖర్‌నాయక్, ఆనంద్, డాగ్‌స్క్వాడ్ సిబ్బంది, ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ పి. సునీల్‌కుమార్, కానిస్టేబుళ్ల డి. పీరయ్య, ఆర్. రామమోహన్‌రెడ్డి, యు. మాబుహుసేన్, డి. శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఆధిక్యంలో కడప, నెల్లూరు జట్లు


రోహిత్ రోషన్ (98 పరుగులు)


సాయిసూర్యతేజారెడ్డి (69 పరుగులు)


కమిల్ (5 వికెట్లు)


సాబ్జాన్‌బాషా (6 వికెట్లు)


ధనుష్‌రెడ్డి (6 వికెట్లు)

కడప స్పోర్ట్స్ : కడప నగరంలో నిర్వహిస్తున్న ఏసీఏ అండర్–23 అంతర్ జిల్లాల మల్టీడేస్ క్రికెట్ టోర్నమెంట్ రసవత్తరంగా సాగుతోంది. కేఎస్ఆర్ఎం మైదానంలో రెండోరోజు గురువారం 244 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో బరిలోకి దిగిన కడప జట్టు మరో 2 పరుగులు చేసి 93 ఓవర్లలో 246 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని ఆదిల్ హుస్సేన్ 63 పరుగులు చేశాడు. కర్నూలు బౌలర్ సాబ్జాన్‌బాషా 6 వికెట్లు తీశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కర్నూలు జట్టు 55.1 ఓవర్లలో 207 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని సాయిసూర్యతేజారెడ్డి 69 పరుగులు చేశాడు. కడప బౌలర్లు వి. ధనుష్ 6 వికెట్లు, అస్లాం 2 వికెట్లు తీశారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన కడప జట్టు రెండోరోజు ఆట ముగిసే సమయానికి 29 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 86 పరుగులు చేసింది. జట్టులోని రోహిత్‌వర్మ 34 పరుగులు చేశాడు. కర్నూలు బౌలర్లు సాబ్జాన్‌బాషా 1, ఇస్మాయిల్ 1, సాత్విక్ 1 వికెట్ చొప్పున తీశారు. రెండోరోజు ఆట ముగిసే సమయానికి కడప జట్టు 125 పరుగుల ఆధిక్యంలో కొనసాగుతోంది.

ఆధిక్యంలో నెల్లూరు..

కేఓఆర్ఎం మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో 78 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో బరిలోకి దిగిన అనంతపురం జట్టు 69.2 ఓవర్లలో 249 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని రోహిత్ రోషన్ 98 పరుగులు చేశాడు. నెల్లూరు బౌలర్లు అఖిల్ 4, అజిత్‌బాబు 3 వికెట్లు తీశారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన నెల్లూరు జట్టు 40.3 ఓవర్లలో 151 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని నిఖిలేశ్వర్‌రెడ్డి 35 పరుగులు తీశాడు. అనంతపురం బౌలర్ కమిల్ 5 వికెట్లు తీశాడు. రెండోరోజు ఆట ముగిసే సమయానికి నెల్లూరు జట్టు 102 పరుగుల ఆధిక్యంలో కొనసాగుతోంది.

ఉరి వేసుకుని మహిళ ఆత్మహత్య

ఎర్రగుంట్ల : మండల పరిధిలోని ఆర్టీపీపీలో కాట రామలక్ష్మీ (62) అనే మహిళ ఇంటిలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుందని కలమల్ల ఎస్ఐ సంజీవరెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. అనంతపురం జిల్లా నార్పల గ్రామానికి చెందిన కాట ఆదిశేషయ్య కుమారుడు కాట చౌడేశ్వరరాజు ఆర్టీపీపీలో ఏఈఈగా పనిచేస్తున్నాడు. దీంతో వీరందరూ ఆర్టీపీపీలోని క్వార్టర్స్‌లో నివాసం ఉంటున్నారు. ఆదిశేషయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. అప్పటి నుంచి ఆయన భార్య కాట రామలక్ష్మి తీవ్ర మనస్థాపానికి గురైంది. దీంతో ఆమె ఇంటిలోని ఫ్యాన్‌కు చీరెతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ మేరకు మృతురాలి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

యువకుడి అదృశ్యం

పెద్దముడియం : మండలంలోని జంగాలపల్లె గ్రామానికి చెందిన మహమ్మద్ రఫీ(20)అనే యువకుడు 10వ తేదీ అదృశ్యమయ్యాడు. పోలీసుల కథనం మేరకు ఇమామ్ హుస్సేన్ కుమారుడైన రఫీ నంద్యాల జిల్లా ఆళ్లగడ్డలో మెకానిక్‌గా పనిచేస్తూ రోజు ఇంటికి వచ్చి వెళ్లేవాడు. రోజు మాదిరిగానే 10వ తేదీ కూడా పనికి వెళ్తున్నా అని చెప్పి ఇంటి నుండి వెళ్లిన రఫీ మళ్లీ ఇంటికి రాలేదు. దీంతో తల్లిదండ్రులు రెండు రోజుల నుంచి బంధువులు, స్నేహితుల దగ్గర విచారించినా ఫలితం లేదు. దీంతో రఫీ అన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామక్రిష్ణ తెలిపారు

జిల్లా రైఫిల్ షూటింగ్ జట్లు ఎంపిక


జిల్లా రైఫిల్ షూటింగ్ జట్టుకు ఎంపికైన క్రీడాకారులు

కడప స్పోర్ట్స్ : కడప నగరం బిల్టప్ సమీపంలోని జాకీర్‌హుస్సేన్ రైఫిల్ షూటింగ్ అకాడమీలో బుధవారం ఎస్‌జీఎఫ్ జిల్లాస్థాయి రైఫిల్ షూటింగ్ ఎంపికలు నిర్వహించారు. ఈ ఎంపికలను ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి బి.అరుణకుమారి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో పతకాలు సాధించే క్రీడాంశాల్లో రైఫిల్‌షూటింగ్ ఒకటన్నారు. క్రీడాకారులు చక్కగా రాణించి జిల్లాఖ్యాతిని చాటి చెప్పాలని సూచించారు. అనంతరం ఎంపికలు నిర్వహించి రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే జిల్లా జట్లను ప్రకటించారు. కార్యక్రమంలో జిల్లా రైఫిల్ షూటింగ్ అసోసియేషన్ కార్యదర్శి జాకీర్‌హుస్సేన్, వ్యాయామ ఉపాధ్యాయులు రాఘవ, నిత్యప్రభాకర్, మహబూబ్‌బాషా, వెంకటలక్ష్మి, ఎల్.ఎ.సునీల్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా రైఫిల్ షూటింగ్ జట్లు..

అండర్–14 బాలికలు : కె.హబీబా సుహాన, వి. జాగృతిరెడ్డి, ఎస్.రేష్మ.

అండర్–14 బాలురు : ఎ. సంజురెడ్డి, నితీష్‌కుమార్.

అండర్–17 బాలికలు : ఎస్.కె. జాగృతి, వి.మౌనిత, బి. ప్రణతి (ఓపన్‌సైట్ విభాగం), శ్రీదేవి, యశస్విని, నవనిధి (పీప్‌సైట్ విభాగం).

అండర్–17 బాలురు : వై.అభినవ్‌కుమార్, వీరేంద్ర, మురళీకృష్ణ.

జూడో ఎంపికలు..

కడప నగరంలోని వైఎస్ఆర్ ఇండోర్ స్టేడియంలో ఎస్‌జీఎఫ్ జిల్లాస్థాయి జూడో ఎంపికలు నిర్వహించారు. రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే జిల్లా జట్లను ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి బి.అరుణకుమారి ప్రకటించారు. కార్యక్రమంలో సెలెక్షన్ కమిటీ సభ్యులు అలీ, షహనాజ్, షబానా తదితరులు పాల్గొన్నారు.

జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు

అండర్–14 జూడో బాలికలు : ఎం.భారతి, ఎల్.యశస్విని, ఎం.సాత్విక, జి.హిందు, ఎం.అమృత, డి.సుప్రజ.

అండర్–14 జూడో బాలురు : సి.శ్రీహరిచరణ్, పి.కిరణ్, ఎస్.పవన్, ఎస్.విజయ్, ఎం.గోవర్ధన్, జి.ప్రశాంత్, బి.చరణ్‌తేజ.

అండర్–17 బాలికలు : ఎస్.జె.సుల్తాన, జి.ప్రణీత, డి.శ్యామల, ఎస్.జె. గీతిక, పి.అమూల్య, ఎస్.హలీమ, ఎస్.సబీనా, పి.షణ్ముకప్రియ.

అండర్–17 బాలురు : కె.సంతోష్, టి.వి.గణేష్, సి.లోకేష్, ఎం.వి.విష్ణువర్ధన్, టి.ఓబులేసు, పి.వి.రిషికిరణ్, జి.వినయ్, ఎస్.మహమ్మద్‌మున్సూర్, పి.అశోక్, బి.త్రినయ్‌చంద్ర.

ప్రభుత్వ పథకాలను మత్స్యకారులు సద్వినియోగం చేసుకోవాలి

జిల్లా మత్స్యశాఖ డిప్యూటీ డైరెక్టర్ నాగలింగాచార్యులు


సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా మత్స్యశాఖ డిప్యూటీ డైరెక్టర్ నాగలింగాచార్యులు

కడప అగ్రికల్చర్ : మత్స్యకారుల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సబ్సిడీ పథకాలను సద్వినియోగం చేసుకుని మెరుగైన జీవనాన్ని పొందాలని జిల్లా మత్స్యశాఖ డిప్యూటీ డైరెక్టర్ నాగలింగాచార్యులు తెలిపారు. గురువారం కడపలో జిల్లా మత్స్యశాఖ కార్యాలయ ఆవరణంలో జిల్లా మత్స్య సహకార సంఘాల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశీయ నీటి వనరులైన నదులు, రిజర్వాయర్లు, చెరువుల్లో వేట చేసేందుకు మత్స్యకారులకు 75 శాతం రాయితీలో బోట్లు, వలలు పొందవచ్చన్నారు. ఈ పథక యూనిట్ ఖరీదు రూ. 50 వేలు కాగా ఇందులో లబ్ధిదారుని వాటా రూ. 12500 మిగతా రూ. 37500 రాయితీగా వస్తుందన్నారు. వీటితోపాటు చేపల రవాణాకు ఉపయోగించే నాలుగు చక్రాల వాహనాలు, మూడు చక్రాల చేపల అమ్మకపు ఆటోలు, ఐస్‌బాక్సులతోపాటు మోపెడ్‌లు రాయితీతో పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో మత్స్య సహకార సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటరమణ, మత్స్యశాఖ అధికారి కిరణ్‌కుమార్, గ్రామ మత్స్య సహాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

50 పడకల ఆసుపత్రి ఏర్పాటు సంతోషకరం


ఆసుపత్రి భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి

పోరుమామిళ్ల : పోరుమామిళ్లలో రూ. 3కోట్లతో 50 పడకల ఆసుపత్రి ఏర్పాటు కావడం చాలా సంతోషంగా ఉందని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి అన్నారు. గురువారం 50 పడకల నూతన భవనాన్ని ఎమ్మెల్సీ ప్రారంభించగా, ఆసుపత్రిలోని వివిధ విభాగాలను రాష్ట్ర ఎన్విరాన్‌మెంట్, మేనేజ్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గుబ్బా చంద్రశేఖర్, రాష్ట్ర పంచాయతీరాజ్ రూరల్ డెవలప్‌మెంట్ సలహాదారు నాగార్జునరెడ్డి, ఆప్కాస్ రాష్ట్ర డైరెక్టర్ డాక్టర్ కల్యాణ చక్రవర్తి, డాక్టర్ మార్కారెడ్డి, పార్టీ నాయకులు, అధికారులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ పోరుమామిళ్ల, బద్వేలులో 50 పడకల ఆసుపత్రుల ఏర్పాటుకు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారన్నారు. జిల్లా ఆసుపత్రుల సమన్వయకర్త హిమదేవి మాట్లాడుతూ ఇక్కడ అన్నిరకాల చికిత్సలు పైసా ఖర్చు లేకుండా పొందవచ్చన్నారు.

ఈ కార్యక్రమంలో నాట్యకళల రాష్ట్ర డైరెక్టర్ శకునాల ఈశ్వరమ్మ, జెడ్పీటీసీ ముత్యాల ప్రసాద్, వైస్ ఎంపీపీలు బాషా, రాజశేఖర్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కల్లూరి రమణారెడ్డి, సచివాలయాల కన్వీనర్ కె. రమణారెడ్డి, సర్పంచ్ చిత్తా రవిప్రకాష్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి చాపాటి లక్ష్మి నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సతీష్ రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు తగదు

వేంపల్లె : శాసనమండలి మాజీ డిప్యూటీ చైర్మన్ ఎస్.వి.సతీష్‌కుమార్‌రెడ్డిపై టీడీపీ ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదని ఆయన అభిమానులు అన్నారు. రెండు రోజులుగా సోషల్ మీడియాలో ద్వితీయ శ్రేణి టీడీపీ నాయకులు, సతీష్‌రెడ్డి అభిమానుల మధ్య మాటల యుద్ధం జరుగుతున్న నేపథ్యంలో గురువారం వేంపల్లె పట్టణంలోని ఎస్సార్ కళ్యాణమండపంలో సతీష్‌రెడ్డి అభిమానులు భారీ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా సతీష్‌రెడ్డి టీడీపీ నుంచి బయటికి వచ్చిన తర్వాత నుంచి ఆయన కుటుంబంపై విమర్శలు చేయడంపై వారు ధ్వజమెత్తారు. దీంతో ఎంతో కొంత ఉన్న టీడీపీ నాయకులలో వర్గ విభేదాలు బట్టబయలయ్యాయి. అనంతరం కల్యాణ మండపం నుంచి వేంపల్లె నాలుగు రోడ్ల కూడలి వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. సతీష్‌రెడ్డిపై రాంగోపాల్‌రెడ్డి చేసిన ఆరోపణలకు క్షమాపణ చెప్పాలని వారు డిమాండ్ చేశారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి దుర్మరణం


అశోక్‌కుమార్‌రెడ్డి (ఫైల్)



మృతులు అశోక్‌కుమార్‌రెడ్డి, గుర్తు తెలియని వ్యక్తి

జమ్మలమడుగు రూరల్ : జమ్మలమడుగు పట్టణ పరిధిలో గురువారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీ కొన్న సంఘటనలో ఇద్దరు వ్యక్తులు మృతిచెందగా మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు.. పట్టణంలోని ముద్దనూరు రహదారిలో ఉన్న హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ సమీపంలో నడుచుకుంటూ వెళుతున్న లక్ష్మయ్య అనే వ్యక్తిని వేగంగా వెళుతున్న ఇన్నోవా వాహనం ఢీ కొంది. ఈ ప్రమాదంలో లక్ష్మయ్య తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సంఘటనను చూసిన స్థానికులు బైక్‌లలో వాహనాన్ని వెంబడించారు. దీంతో వాహన డ్రైవర్ అతి వేగంగా పెద్దపసుపల రహదారి గుండా వెళ్లిపోయాడు. తరువాత బైపాస్ రోడ్డు నుంచి మునిసిపల్ కార్యాలయం మీదుగా అతి వేగంగా ప్రొద్దుటూరు వైపు మళ్లించాడు. దాదాపు 4 కిలో మీటర్లు వెళ్లిన తరువాత జమ్మలమడుగు నుంచి ప్రొద్దుటూరుకు స్కూటీలో వెళుతున్న యర్రగుంట్ల మండలం ఇల్లూరుకు చెందిన ఎంఎస్ అశోక్ కుమార్‌రెడ్డి (22) అనే యువకుడిని వెనుక వైపు నుంచి ఢీ కొన్నాడు. దీంతో అక్కడికక్కడే అతను మృతి చెందాడు. అశోక్‌కుమార్‌రెడ్డి జమ్మలమడుగు పట్టణంలోని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌లో విధులు నిర్వహిస్తున్నాడు. తిరిగి వంద అడుగులు వెళ్లిన తరువాత గుర్తు తెలియని వ్యక్తిని(45) అదే వాహనం ఢీకొనడంతో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. వాహనదారుడు ప్రొద్దుటూరు వైపు వెళ్లినట్లు స్థానికులు తెలిపారు.

ఉత్సాహంగా యోగ ఎంపికలు



ఎస్‌జీఎఫ్ యోగ అండర్-14, అండర్-17 బాలికల జట్లు, ఎస్‌జీఎఫ్ యోగ అండర్-14, అండర్-17 బాలురజట్లు

రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా జట్లు ఎంపిక

కడప స్పోర్ట్స్ : కడప నగరంలోని వైఎస్ఆర్ ఇండోర్ స్టేడియం వేదికగా నిర్వహించిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లాస్థాయి యోగ క్రీడా ఎంపికలు ఉత్సాహంగా సాగాయి. ఈ ఎంపికలను ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి బి. అరుణకుమారి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతిభ కలిగిన క్రీడాకారులను జిల్లా జట్లకు ఎంపికచేసి రాష్ట్రస్థాయి పోటీలకు పంపనున్నట్లు తెలిపారు. అనంతరం యోగ శిక్షకులు డాక్టర్ ఆర్. రంగనాథరెడ్డి, పెంచలయ్య తదితరులు యోగ ఆసనాల గురించి వివరించారు. ఉమ్మడి వైఎస్ఆర్ జిల్లాలోని 10 నియోజకవర్గాల నుంచి దాదాపు 350 మంది క్రీడాకారులు యోగ ఎంపికలకు హాజరయ్యారు. అనంతరం ఎంపికలు నిర్వహించి రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే జిల్లా జట్లను ప్రకటించారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు నిత్యప్రభాకర్, మహబూబ్‌బాషా, ప్రవీణ్‌కిరణ్, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు..

యోగ అండర్–14 బాలికలు : ఎస్. సన్ని, కె.మనస్వి, ఎస్. సన్నీ, కె. హేమ, ఎన్.సమీర, కె.ఎల్.అస్మిత, ఎ.లక్ష్మిప్రియ. స్టాండ్‌బై: ఎస్.అస్మిత, ఎస్.భవిత, ఎల్.చందన.

యోగ అండర్–14 బాలురు : పి.భరత్, బి. శివకేశవ, ఎస్.సాయిధనుంజయ, కె.సాత్విక్, ఎం.నాగేంద్ర, జి. విజయసుందర్‌రెడ్డి. స్టాండ్‌బై : జి.జయకేశవ, వై.అరుణ్‌కుమార్, ఎస్.అర్షద్, బి.సుశాంత్.

యోగ అండర్–17 బాలికలు : సి.ప్రవళ్లిక, ఎస్.శివజ్యోతిరెడ్డి, టి.శ్రీవిద్య, పి.మేఘన, ఎం.నాగవైష్ణవి, జి.శిరీష, ఎం.లాస్య, స్టాండ్‌బై : ఎస్.అమూల్య, వి.దేవి, టి.గాయత్రి, కె.నందిని, బి.అనూరాధ.

యోగ అండర్–17 బాలురు : ఎం.సాయికుమార్‌నాయక్, టి.నర్సింహరేవంత్, ఎం.జగదీష్, ఎన్.రేవంత్‌కుమార్, ఆర్.వెంకటేష్, ఎస్.ముజీబ్, జి.వెంకటకృష్ణ, స్టాండ్‌బై: వై.భరత్, జె.జశ్వంత్, వెంకటవినయ్‌కుమార్, పి.రత్నాకర్.

రేపటి నుంచి జర్నలిస్టుల షటిల్ టోర్నమెంట్

పులివెందుల టౌన్ : ఈ నెల 14, 15 తేదీలలో నిర్వహించే రాష్ట్రస్థాయి జర్నలిస్టుల షటిల్ టోర్నమెంటును విజయవంతం చేయాలని టోర్నీ కన్వీనర్ వెంకటరమణారెడ్డి, టోర్నీ చైర్మన్ శ్రీనాథరెడ్డి, పులివెందుల జర్నలిస్టులు కోరారు. స్థానిక వైఎస్సార్ ఇండోర్ స్టేడియంలో జరగనున్న ఈ టోర్నమెంట్‌లో 25 జిల్లాల నుంచి జర్నలిస్టులు పాల్గొంటారన్నారు. ముఖ్య అతిథులుగా కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డితో పాటు పలువురు రాజకీయ నాయకులు హాజరవుతారన్నారు. ఈ సందర్భంగా కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి చేతుల మీదుగా టోర్నమెంట్‌కు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు.

రీ సర్వే మరింత వేగవంతం చేయాలి

– ఏపీ స్పెషల్ సర్వే అధికారి సుబ్బారావు


మాట్లాడుతున్న సుబ్బారావు

జమ్మలమడుగు : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అర్బన్ రీసర్వే కార్యక్రమాన్ని మున్సిపాలిటీ ప్రాంతంలో మరింత వేగవంతం చేయాలని ఏపీ స్పెషల్ సర్వే ఆఫీసర్ సుబ్బారావు పేర్కొన్నారు. గురువారం ఆయన ప్రొద్దుటూరు రహదారిలో ఉన్న మున్సిపల్ కార్యాలయాన్ని సందర్శించి అధికారులతో అర్బన్ రీసర్వేపై సమీక్షా సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో జిల్లాకు ముఖ్యమంత్రి రానున్న నేపథ్యంలో ఆలోగా రీసర్వే పూర్తిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ప్రాజెక్టు డైరెక్టర్ ప్రభాకర్ రావు, రీజినల్ డైరెక్టర్ పీవీఎస్ మూర్తి, డీటీ సీపీఓ కృష్ణసింగ్, మున్సిపల్ కమిషనర్ జి.వెంకట్రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో ఆరుగురు సీఐల బదిలీ

కర్నూలు–కడప రేంజ్ పరిధిలో వైఎస్ఆర్ జిల్లాలో ఆరుగురు సీఐలను బదిలీ చేస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులను జారీ చేసింది. – కడప అర్బన్

సీఐ పేరు	ప్రస్తుతం	బదిలీ అయిన స్థానం
ఎం. కరుణాకర్	వి.ఆర్ సత్యసాయి జిల్లా	జమ్మలమడుగు యు/జి పీఎస్
ఆర్. అర్జున్ నాయక్	ఫ్యాక్షన్ జోన్, ప్రొద్దుటూరు	వి.ఆర్, కడప
బి.బొజ్జప్ప	ఫ్యాక్షన్ జోన్, కడప	ఫ్యాక్షన్ జోన్, ప్రొద్దుటూరు
జె. శంకరయ్య	డిసిఆర్‌బి, కడప	ఫ్యాక్షన్ జోన్, కడప
సయ్యద్ హాసం	కడప టూటౌన్ యు/జిపిఎస్	డిసిఆర్‌బి, కడప
ఎం. తబ్రేజ్	వి.ఆర్.కర్నూలు జిల్లా	కడప టూటౌన్ యు/జి పిఎస్

యువకుడి ఆత్మహత్య

మదనపల్లె : నీరుగట్టువారిపల్లెకు చెందిన పరశురామ్ కుమారుడు సాయినాథ్(20) ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మూడేళ్ల వయస్సులోనే తల్లి మృతి చెందింది. తండ్రి ఇతడిని వదిలి వెళ్లిపోయాడు. ఒంటరిజీవితంపై విరక్తితో ఈ చర్యకు పాల్పడ్డాడు.